సృజనాత్మకతను వెలికితీసేందుకు సదస్సులు దోహదం


సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సుల్తాన్‌బజార్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సదస్సులు దోహదపడుతాయని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం (చాకలి ఐలమ్మ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత అన్నారు. 24వ జాతీయ సైన్స్ డే వేడుకల్లో భాగంగా మంగళవారం కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో టీజీ కాస్ట్ ద్వారా జంతుశాస్త్రం, కేరియర్ ఎంపికలపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వైస్ ఛాన్సలర్ అధ్యక్షత వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగ అధిపతి ప్రొఫెసర్ మాధవి తన ప్రధాన ఉపన్యాసాన్ని విద్యార్థులకు అందించారు. జంతుశాస్త్రం విభాగాధిపతి కన్వీనర్ డాక్టర్ సునీలకుమారి నేతృత్వంలో జరిగిన సదస్సులో యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సరస్వతి, డాక్టర్ లోక పావని, శైలజ, డాక్టర్ జయశ్రీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ నాగరాజరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు'


మాట్లాడుతున్న విజయటెక్కి

విజయనగర్‌కాలనీ: కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నారాయణ విద్యాసంస్థల ఆర్అండ్‌బీ విభాగాధ్యక్షుడు విజయ్‌టెక్కి అన్నారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థుల భవిష్యత్, ప్రణాళికపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 10వ తరగతి తర్వాత ఎలాంటి విద్యనభ్యసించాలి, ఎక్కువ అవకాశాలు ఏ విభాగంలో ఉంటాయనే విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ కళాశాలల ఏజీఎం సుబ్బారెడ్డి, విద్యావేత్త శ్రీనివాస్‌రెడ్డి, ఆసిఫ్‌నగర్ గుడిమల్కాపూర్ పాఠశాల ప్రిన్సిపాల్ పర్హాన ముబీన్, ఆర్ఐ నవీన్‌కుమార్, ఏఓ లావణ్య పాల్గొన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి



హెరిటేజ్‌వాక్‌లో సిటీ కాలేజీ విద్యార్థులు

చార్మినార్: వారసత్వ సంపదను కాపాడుకోవాలని దక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ అన్నారు. పర్యాటక వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ సిటీ కాలేజీ కామర్స్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హెరిటేజ్ కార్యక్రమం జరిగింది. సిటీ కాలేజ్ నుంచి పురానీహవేలీ వరకు కొనసాగిన ఈ హెరిటేజ్‌వాక్‌లో ఆయన పాల్గొని వారసత్వ కట్టడాల విశేషాలను విద్యార్థులకు వివరించారు. సీనియర్ ఆర్కిటెక్ట్ తాన్య శ్రీ వాస్తవ ఈ హెరిటేజ్ వాక్‌లో పాల్గొని వారసత్వ కట్టడాల విశేషాలను వివరించారు. డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ నీరజ, డాక్టర్ ఝాన్సీ డాక్టర్ రవీంద్రబాబు, నేహా, రాజేష్, అరుణ పాల్గొన్నారు.

27 వరకు పర్యాటక వారోత్సవాలు..

సిటీ కళాశాల కామర్స్, మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 27 వరకు నిర్వహించ తలపెట్టిన పర్యాటక వారోత్సవాలను కళాశాల విద్యాశాఖ సంచాలకుడు ఆచార్య యాదగిరి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతూ విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు. విద్యాశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రాజేందర్ సింగ్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్, సిక్కిం గ్లోబల్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పాటుకుచి త్రయంబకం పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్‌లో జీహెచ్ఎంసీ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఖైరతాబాద్ జోనల్ ఇన్‌చార్జి కమిషనర్ రవికిరణ్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు పర్యటించి అభివృద్ధి పనులు పర్యవేక్షించాలని కోరారు. ఈ సందర్భంగా రవికిరణ్ సానుకూలంగా స్పందించి వెంటనే అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌గంజ్ నాలా పూడికతీత పనులు చేపట్టాలి


నాలాను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: కిషన్‌గంజ్ నాలా పూడికతీత పనులు చేపట్టాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ కోరారు. మంగళవారం ఆయన కిషన్‌గంజ్ నాలాను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గతేడాది నుంచి నాలా కట్టడం పూర్తయిందికానీ ఇందులో మట్టిని తీయకుండానే నాలా కట్టడాలు పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం వరద పెరగడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. జీహెచ్ఎంసీ డీసీ విద్యాధర్, నాయకులు గోపాల్, కౌశిక్, కట్టప్ప, చంద్రకాంత్, నందుకుమార్, అనిల్‌యాదవ్, ఆకాష్, రాజు, పప్పు పాల్గొన్నారు.

నేడు హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు


విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న నారాయణ, శ్రీనివాస్ నాయక్ తదితరులు

చాంద్రాయణగుట్ట: ఈనెల 25న హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ (హెచ్‌డీఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 68వ బండ్లగూడ మండల స్థాయి ఆటల పోటీలు శారద విద్యాలయ ఉన్నత పాఠశాలలో ప్రారంభంకానున్నాయి. ఈ పోటీల్లో పాల్గొననున్న చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో డిజైన్ చేసిన యూనిఫాంలను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి బండ్లగూడ రేంజ్–1 ఉప విద్యాశాఖ అధికారి ఎస్.లక్ష్మణ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి, ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.నారాయణ, ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ నాయక్, పి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

టోలిచౌకీలో ఎమ్మెల్యే పర్యటన


టోలిచౌకీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: భారీ వర్షాలకు గురైన ప్రాంతాల్లో వెంటవెంటనే సహాయక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వరద నీటి చొచ్చుకొచ్చిన వ్యాపార సముదాయాలను పరిశీలించారు. రుమాన్ హోటల్, రహమత్ హోటల్, లిబ్రా షాదీఖానా తదితర వ్యాపార కేంద్రాలను ఆయన చూశారు. ఈ సందర్భంగా ఆయన అలహస్‌నత్‌నగర్ కాలనీ ఎగువ ప్రాంతాల నుంచి నిజామ్ కాలనీ గుండా టోలిచౌకీ చౌరస్తా వద్దకు వస్తున్న వరద నీరు నేరుగా శాతం చెరువులోకి వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. టోలిచౌకీ చౌరస్తా, విరాసత్‌నగర్ తదితర ప్రాంతాల్లో బాక్స్ టైపు డ్రైనేజీ పనులు చేపట్టి వర్షపు నీరు టోలిచౌకీ చౌరస్తాలోని వ్యాపార సముదాయాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షులు హారూన్‌ఫారన్, బల్దియా ఏఈ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

వంతెన.. ఇంతేనా!

- పురానాపూల్ పాత వంతెన మార్కెట్ మయం.. కొత్త వంతెన ట్రాఫిక్‌మయం
- గంటల తరబడి పురానాపూల్ చౌరస్తా జామ్
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


అదనపు వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

జియాగూడ: పురానాపూల్ చౌరస్తా నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చౌరస్తా ఎన్నో ప్రాంతాలకు వెళ్లే ప్రధాన కూడలి కావడం విశేషం.

పాత వంతెనపై మార్కెట్..

పురానాపూల్ వంతెనపై కూరగాయలు, నిత్యావసర వస్తువులు, తోపుడు బండ్లపై పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడికి చేరువ గల సబ్జిమండిని గుడిమల్కాపూర్ మార్కెట్‌కు తరలించడం వల్ల అక్కడ చోటు లభించని వారు పురానాపూల్‌పై విక్రయాలు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. దీంతో కొనుగోలు చేసేవాళ్లు జియాగూడ, రహీంపురా, ధూల్‌పేట్ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చి వాహనాలు నిలిపి వేసి వెళ్తుంటారు. దీంతో కూడా చౌరస్తా ట్రాఫిక్ జాం అవుతుంది. పండుగ రోజుల్లో మరి దారుణం. అప్పట్లో రాకపోకల కోసం 400 ఏళ్ల క్రితం నిర్మించింది.

అదనపు వంతెనపై ట్రాఫిక్..

పాత వంతెన మార్కెట్‌గా కొనసాగుతుండగా పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా నిర్మించిన అదనపు వంతెన సరిపోక ట్రాఫిక్ నిలిచి పోతోంది. ఉన్న అదనపు వంతెనపై నుంచి పాతబస్తీ, జియాగూడ, కార్వాన్, మంగళ్‌హాట్, అఫ్జల్‌గంజ్, 100 ఫీట్ల జాతీయ రహదారి, తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ఒకే వంతెనపై నుంచే ఉండడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచి పోవడం సాధారణంగా మారింది.

పాత వంతెనపై ఉన్న మార్కెట్‌ను తరలించాలి..

పాత వంతెనపై ఉన్న మార్కెట్‌ను తరలించాలని ప్రయాణికులు కోరుతున్నారు. వంతెనపై కొనసాగుతున్న చిరు వ్యాపారస్తులకు కూడా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్కెట్లో స్థానం కల్పించి వారిని తరలించి రెండు వంతెనలను వాడుకలోకి తీసుకువస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నిలిచిపోయిన చౌరస్తా విస్తరణ పనులు చేపట్టడంతో పాటు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పాత వంతెనపై మార్కెట్

'దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం'



లంగర్‌హౌస్: దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని లంగర్‌హౌస్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోగి బాలరాజ్, గౌతమ్ అనిల్‌కుమార్ అన్నారు. దసరా ఉత్సవ కమిటీ ఎన్నికల అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోగి బాలరాజ్, గౌతమ్ అనిల్‌కుమార్, కోశాధికారిగా శ్రీనివాస్‌ను సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమిటీ ప్రతినిధులతో పాటు మాజీ ప్రతినిధులతో కలిసి ముందుకు సాగుతామన్నారు. అందరిని ఆకట్టుకునే విధంగా సంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. వారితో పాటు కోశాధికారిగా ఎన్నికైన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి


గన్‌ఫౌండ్రీ: బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో పలు కార్పొరేషన్ చైర్మన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే బీసీల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జెగ్గారెడ్డి, మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత ఐలమ్మ, బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


రబియా బేగం

గౌలిపురా: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహ్మద్ జమీలుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ ఫారూఖ్ తన తల్లి రబియా బేగం (64)తో మంగళవారం ఉదయం 8 గంటలకు లోన్ చెల్లింపు విషయంలో వాగ్వాదం జరిగింది. దీంతో రబియా బేగం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడు స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన తల్లి కనిపించడం లేదని కుమారుడు ఫారూఖ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..


మహమ్మద్ షాబాజ్

వ్యక్తి అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..మొఘల్‌పురా ప్రాంతానికి చెందిన సల్మా బేగం, మహమ్మద్ షాబాజ్ (30)లు దంపతులు. ఈనెల 22న షాబాజ్ నషేమాన్‌నగర్‌లో నివాసముండే తల్లి వద్దకు వెళ్తున్నాని భార్యకు చెప్పి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన భార్య, కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

యాకుత్‌పురా: నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. యాకుత్‌పురా రైల్వేస్టేషన్ నుంచి నాగాబౌలీ డబీర్‌పురా వరకు చేపట్టిన రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు మంగళవారం ఆయన అధికారులతో కలిసి నష్టపరిహారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్, డబీర్‌పురా కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, అలందార్ వాలాజాహి, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు మార్చొద్దు'


దామోదర్ గుప్తా

అబిడ్స్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు మార్చొద్దని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించి మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి పేరును మార్చాలని చూడడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు అలాగే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో టీఎఫ్‌సీవో కార్యాలయాలు


గోపాల్‌కు టీఎఫ్‌సీవో సభ్యత్వ పుస్తకాన్ని అందజేస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామని ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం టోలిచౌకీలో కార్యాలయంలో మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన వారికి సభ్యత్వ పుస్తకాలు, నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల జోలికి వెళ్లకుండా కేవలం దంపతుల మధ్య అపోహలు తొలగించి వారిని సజావుగా కాపురం చేసుకునేలా చేయడమే తమ ఆర్గనైజేషన్ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన మెదక్‌కు చెందిన గోవింద్, సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేశ్వర్లుకు సభ్యత్వ పుస్తకంతో పాటు ఆయా జిల్లా ఇన్‌చార్జీలుగా నియామక ఉత్తర్వులను అందజేశారు.

ప్రతి పాఠశాలలో దోమల మందు పిచికారీ


విద్యార్థులతో ఎంటమాలజీ విభాగం ఏఈ రమేష్, సిబ్బంది

గోల్కొండ: ప్రతి పాఠశాలలో దోమల మందు పిచికారీ చేస్తున్నామని గోల్కొండ వార్డు అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రమేష్ అన్నారు. మంగళవారం ఆయన నయాఖీలాలోని ఉర్దూ మోడల్ స్కూల్‌లో దోమల వల్ల వచ్చే వ్యాధులు, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తి చెందకుండా మూడు రకాలుగా మందులను వాడతామని తెలిపారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవని పేర్కొన్నారు. ముఖ్యంగా మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆయన సిబ్బంది సి.రాజ్‌కుమార్, కిషన్‌తో కలిసి పాఠశాల తరగతి గదులు, సెల్లార్, వాష్‌రూమ్‌లలో దోమల మందును పిచికారీ చేశారు.

మహాత్మా మన్నించు!

- బాపూ సమాధి నిర్వహణ గాలికి
- పెరిగిన చెట్లు, ముళ్ల పొదలు
- 35 ఏళ్లల్లో ఇదే మొదటి సారి


బాపూ సమాధి వద్ద పేరుకుపోయిన బురద

లంగర్‌హౌస్: మహాత్మాగాంధీ సమాధిని ప్రపంచ దేశాలు సైతం పవిత్ర ప్రార్థన స్థలాలుగా భావిస్తాయి. అలాంటిది ఇక్కడ బాపూ సమాధి నిర్వహణ గాలికి వదిలేశారు. బాపూ సమాధి వద్ద ఇంతటి ఘోర పరిస్థితి 35 ఏళ్లల్లో ఎప్పుడు చూడలేమని స్థానికులు మండిపడుతున్నారు. బాపూ ధ్యానమందిరం నుంచి బాపూ సమాధికి వెళ్లేదారి చెట్లు, ముళ్ల పొదలు, చెత్త, రాళ్లు, బురద, మందు బాటిళ్లతో నిండి పోయింది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గాంధీ సమాధిపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటని స్థానికులు అంటున్నారు. గతంలో గాంధీ జయంతి సందర్భంగా నెల రోజుల ముందు నుంచే రంగులు వేయడం, ఏర్పాట్లు చేయడం జరిగేవి. ప్రస్తుతం ఇక్కడి పరిస్థితిని చూసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గాంధీయవాదులు, స్థానికులు సంబంధిత అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాపూ సమాధి పవిత్రతను కాపాడాలని కోరుతున్నారు.


బాపూ సమాధి ముందు చెత్తాచెదారం


అధ్వానంగా బాపూ సమాధికి వెళ్లే దారి

ఎస్సీ వర్గీకరణ విజయం అమరవీరులకు అంకితం


నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: ఎస్సీ రిజర్వేషన్ పోరాటంలో అమరులైన మాదిగ సోదరులు చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఎంఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రుద్రవరం మాదిగ అన్నారు. మంగళవారం అబిడ్స్‌లోని పొన్నాల సురేందర్ మాదిగ విగ్రహం వద్ద వివిధ ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సుప్రీంకోర్టు ద్వారా సాధించిన వర్గీకరణ విజయాన్ని మాదిగ అమరవీరులకు అంకితమిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయిత వేముల మల్లన్న, ప్రొఫెసర్ తిరుపతి, అడ్వకేట్ మల్లికార్జున్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ మాదిగ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పురస్కారం ప్రదానం


రామాచారి దంపతులను సన్మానిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: పద్మ విభూషణ్ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 4వ వర్ధంతి సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు కె.రామాచారికి కిన్నెర–బాలు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లిటిల్ మ్యూజిషియన్ అకాడమీ విద్యార్థుల సినీసంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, శ్రీ డెవలపర్స్ ఎండీ బోగరాజు మూర్తి, కిన్నెర కార్యదర్శి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతికూలతలను తొలగించినప్పుడే నిజమైన వృద్ధి



మాట్లాడుతున్న దర్పణ్ వాసుదేవ్

నాంపల్లి: ప్రతికూలతలను తొలగించినప్పుడే నిజమైన వృద్ధి జరుగుతుందని పరిశ్రమ నిపుణుడు దర్పణ్ వాసుదేవ్ అన్నారు. మంగళవారం తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో 'ది కాటలిస్ట్ ఎఫెక్ట్'పేరుతో సదస్సు జరిగింది. పలువురు పారిశ్రామికవేత్తలు, నిపుణులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వక్తగా హాజరైన దర్పణ్ వాసుదేవ్ మాట్లాడుతూ..మీలోని ప్రతికూలతను ప్రతిరోజూ తొలగించుకోవాలని కోరారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ..పరిశ్రమల నిపుణులు వ్యక్తిగత వృద్ధిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా, సేవ, అనుభవం, నాణ్యతను గణనీయంగా పెంచుకోగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటకం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా తదితరులు పాల్గొన్నారు.

బెంగాలీల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న దీపాంకర్ పాల్

చార్మినార్: బెంగాలీల సంక్షేమానికి తమ సంఘం నిరంతర కృషి చేస్తుందని తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షుడు దీపాంకర్ పాల్ అన్నారు. మంగళవారం మీనార్ గార్డెన్‌లో జరిగిన సంఘం వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తమ సొంత ప్రాంతాలను వదిలి నగరంలో స్థిరపడిన బెంగాలీల సంక్షేమానికి తాము నిరంతరం పనిచేస్తున్నామన్నారు. ముఖ్యంగా వెస్ట్ బెంగాల్‌కు చెందిన బెంగాలీలందరూ నగరంలో దాదాపు జ్యువెలరీ తయారీ కార్ఖానాలలో తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారన్నారు. వీరందరికీ అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తమ సమితి కృషి చేస్తుందన్నారు. కర్మాకర్, హిరన్మై, దుంప సాంబురాయి, బచ్చు, ఉత్తం, వరుణ్, శ్రీమంత్, శ్యామల్, సుశాంత్, గౌతం బచ్చు తదితరులు పాల్గొన్నారు.

బంగారం ఉన్న పర్సు పోలీసులకు అందజేత

సుల్తాన్‌బజారు: ఓ పర్సులో మూడున్నర తులాల బంగారం, రూ.వెయ్యి నగదు లభ్యమైన ఘటన మంగళవారం రాత్రి సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉస్మానియా మెడికల్ కళాశాల వద్దనున్న పటాన్ చెరు బస్టాప్ పక్కన సులభ్ కాంప్లెక్స్ ఫుట్‌పాత్‌పై ఓ పర్సు పడి ఉండడంతో బేగంబజార్‌కు చెందిన రమేష్, దేషాగౌడ్ ఆనంద్‌కుమార్‌కు కనిపించింది. వారు అక్కడే బెల్టులు, బ్యాగుల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఆ పర్సున్ చూసిన వారు దానిని తెరవగా మూడున్నర తులాల బంగారు చైన్, రూ.1000 నగదు ఉండడంతో సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.